క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన మహిళా జట్టు



శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం మహిళా క్రికెట్ జట్టుట్ జిల్లాస్థాయిలో జరిగిన క్రికెట్ పోటీలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గ స్పోర్ట్సు కో ఆర్డినేటరు రాగుల రాధాకృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామ సచివాలయ-శావల్యాపురం గ్రామ సచివాలయం మహిళ జట్లు ఫైనల్స్ తలపడగా శావల్యాపురం జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు కో ఆర్డినేటర్ తెలిపారు. ఆయనతో పాటు ఆదాంఖాన్, నాగమల్లేశ్వరీ, మహిళా పోలీసు గౌసియా పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



రొంపిచర్ల: మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన షేక్ సుభానీ కుటుంబ సభ్యులకు శుక్రవారం వైఎస్సార్ బీమా యోజన పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి ఈ పథకం కింద రూ.10 వేల రూపాయల నగదును మృతుడి భార్య నాగుల్ బాజీకి అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన సుబానీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందేవిధంగా కృషి చేస్తానన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి, గ్రామపెద్దలు పడాల వీరారెడ్డి, గ్రామ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట: పట్టణంలోని బాపనయ్యనగర్‌లో గల సబ్‌స్టేషన్-6లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు బాపనయ్యనగర్, షాలెంనగర్, రెడ్లబజారు, రిక్షాసెంటర్, టౌన్‌హాలు సెంటర్, సెయింటాన్స్ స్కూలు సెంటర్, కంభంపాలెం, రిజిష్టర్ ఆఫీసు కార్యాలయ సెంటర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్రెంటీస్ విధానం వెనక్కి తీసుకోవాలి

సత్తెనపల్లి: కొత్తగా డీఎస్సీలో ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలు అప్రెంటిస్‌గా పని చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఈ నిర్ణయం సరైంది కాదని పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బంకా వాసుబాబు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పీఆర్‌టీయూ పోరాటాల వల్ల ఆనాడు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయిస్తూ జీవో 2ని తీసుకురావడం జరిగిందన్నారు. దానిని మరలా తీసుకురావడంతో.. అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. డీఎస్సీలో 6,100 టీచర్ పోస్టులను భర్తీ చేయడం విద్యా రంగంలో శుభ పరిణామమని, అదే విధంగా ఇంటర్నేషనల్ బకాలిరియేట్ (ఐబీ) సిలబస్‌తో ఒప్పందం చేసుకోవడం వల్ల మన రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగల సామర్థ్యాలను పెంపొందించుకుంటారని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం



నకరికల్లు: ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగు ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సైదయ్య అన్నారు.గుండ్లపల్లి గ్రామంలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న కంది పైరులో పంటకోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కోఫూరి గోపి సాగు చేస్తున్న పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో 660 కేజీల కంది దిగుబడి వచ్చిందన్నారు. అంతర పంటలుగా మినుము, పెసర, దోస పండించినట్లు తెలిపారు. అంతర పంటల ద్వారా రూ.15 వేల ఆదాయం వచ్చిందని చెప్పారు. కంది ద్వారా వచ్చిన ఆదాయం నికర ఆదాయంగా రైతుకు మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, బాజీబాబు, రామసుబ్బారెడ్డి, పురుషోత్తం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యం
- సొలస, చక్రాయపాలెం గ్రామాల్లో జగనన్న ఆరోగ్యసురక్ష 2.0 మెగాక్యాంపులు
- క్యాంపెయిన్‌కు అనూహ్య స్పందన



సొలసలో మెగావైద్య శిబిరానికి వచ్చిన వైద్య బృందం



సొలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తరలివచ్చిన జనం



చక్రాయపాలెంలో రోగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్యసిబ్బంది

యడ్లపాడు: ఆరోగ్యమైన ఆంధ్రప్రదేశ్ రూపకల్పనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ ఎంపీపీ ఎంవీబాలచంద్రారెడ్డి చెప్పారు. మండలంలోని సొలస గ్రామంలో యడ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు శుక్రవారం ఏర్పాటు చేశారు. క్యాంపు ప్రారంభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష మెగా క్యాంపులను ఏర్పాటు చేశారని, తిరిగి ఈ ఏడాది జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 పేరిట మరోమారు ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈమెగా వైద్య శిబిరంలో వైద్యులు ఎం.ప్రభాకరరావు, కంటి వైద్యులు జి సుబ్బారావు, స్పెషలిస్టులు సంఘవి, దీప్తి పాల్గొన్నారు. సొలస, కొత్తసొలస గ్రామాలకు చెందిన 324 మంది రోగులు హాజరయ్యారు. వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అనంతరం వైద్యులు చికిత్స అందించి ఉచిత మందులు పంపిణీ చేశారు. 153 మంది మహిళలు, 171 మంది పురుషులు, మరో ఇద్దరు చిన్నారులు వైద్య సేవల్ని అందుకున్నారు. అలాగే 87 మంది కంటి సంబంధిత పరీక్షలు చేయించుకున్నారు. ఒకరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పున్నారావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలూరి శ్రీనివాసరెడ్డి, జంగాలపల్లి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎస్ఎం చైర్మన్ మద్దూరి శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం ఈవీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్రాయపాలెంలో..

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని చక్రాయపాలెం సచివాలయంలో మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. బొల్లాపల్లి పి.హెచ్.సి. వైద్యాధికారి పి.శంకర నారాయణ, వెల్లటూరు పి.హెచ్.సీ వైద్యులు వి.సాయి తేజ, ప్రత్యేక వైద్యనిపుణులు కె.ఎల్.ఎస్.రావు, కంటి వైద్యనిపుణులు ఎస్‌కె చాంద్ బాషాలు రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రోగులకు రక్త పరీక్షలు, బీపీ వంటి పరీక్షలు చేశారు.ఈ వైద్యశిబిరంలో సుమారు 351 మందికి వైద్య చికిత్స అందజేశామని, వీరిలో 52 మందికి కంటి వైద్య చికిత్సలు చేశామని వైద్యాధికారి పి.శంకర నారాయణ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సురక్షతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని, వైద్య సేవల్లో ప్రత్యేక వైద్య నిపుణులు వైద్యసేవలు అందుతున్నాయని వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.కె.జిలానీ బాషా, పి.హెచ్.సి. సి.హెచ్.ఓ మల్లయ్య వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి గ్రామంలో...

రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యశిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్.రేవతిభాయి, డాక్టర్ బి.మురళీధర్, వైద్య నిపుణులు డాక్టర్ జి.దుర్గాంబ, డాక్టర్ జి. వేణుగోపాల్ పాల్గొని వైద్యసేవలు అందించారు. శిబిరంలో బీపీ, షుగర్, సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు, వైఎస్సార్ కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో గ్రామానికి చెందిన 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందికి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అదే విధంగా 34 మంది బీపీ, 29 మందికి షుగర్, 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సురేష్ కుమార్, గ్రామ సర్పంచ్ నందిగం మంగమ్మ, ఉప సర్పంచ్ ఇంగుటూరి రంగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చక్రాయపాలెంలో వైద్య చికిత్సలు అందజేస్తున్న ప్రత్యేక వైద్య నిపుణులు



కొత్తపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మురళీధర్

సాతులూరులో 414 మందికి వైద్య పరీక్షలు

నాదెండ్ల: రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. సాతులూరు 2వ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత, ఆర్థోపెడిక్ వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అలేఖ్య పాల్గొని 414 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో విడతల వారీగా వైద్య క్యాంపులు నిర్వహించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో మంచానికే పరిమితమైన వారికి ఇళ్లవద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మందుల కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, సచివాలయ కన్వీనర్ ఉడతా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, రమేష్, నాయకులు పాల్గొన్నారు.



సాతులూరులో లబ్ధిదారులకు మెడికల్ కిట్లు అందిస్తున్న ఎంపీపీ తలతోటి రాణి

జగన్ పెద్ద కొడుకు! వలంటీర్లు ఇంటి సభ్యులు!

- సేవలు చేస్తున్నారంటూ ఐసీయూలో చికిత్స పొందుతున్న వృద్ధురాలి మెచ్చుకోలు
- పల్నాడు జిల్లా వాసికి గుంటూరు జిల్లాకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్



గుంటూరు జీజీహెచ్ ఐసీయూకు వెళ్లి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ అల్లడి హెవిలా

యడ్లపాడు: ఒకటో తేదీ రాగానే గుడ్‌మార్నింగ్ అంటూ ఇంటి తలుపు తట్టి పెన్షన్ డబ్బులు ఇవ్వడమే వలంటీర్ కర్తవ్యం. కానీ ఆ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని ఆమె ఎక్కడ ఉన్నా వెళ్లి ఇచ్చి ఆ కుటుంబంలోని సభ్యుల్లా మారిపోవడం మనసున్న వారికే సాధ్యమవుతుంది. యడ్లపాడు మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన షేక్ ఖాసింబి వృద్ధురాలు కొద్దికాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు కిందట డయాలసిస్ చేయించుకునే నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరు జీజీహెచ్‌లో చేరింది. ఒకటో తేదీ నుంచి పెన్షన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్ అల్లడి హవెలా విషయం తెలిసిన వెంటనే శుక్రవారం జీజీహెచ్‌లోని ఐసీయూకు వెళ్లి పెన్షన్ నగదు అందజేసింది. దీంతో వృద్ధు రాలి కళ్లు ఆనందంతో మెరిశాయి. జగనన్న పెద్దకొడుకులా.. వలంటీర్లు కుటుంబ సభ్యు ల్లా కలిసిపోయి పేదలకు చేస్తున్న సేవలు ఎన్నటికీ మర్చిపోలేనంటూ కంట నీరు పెట్టుకుంది. వృద్ధురాలి కుటుంబ సభ్యులు కూడా వైద్యఖర్చులకు ఇబ్బంది పడుతున్న సమయంలో వెతుక్కుంటూ వచ్చి పెన్షన్ ఇచ్చిన వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న ఎంపీడీవో కవితా



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

శావల్యాపురం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నూతన కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 11 వేల 496 వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నూతన కార్డులు మంజూరైనట్లు చెప్పారు. నూతన ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులకుకార్పొరేటు వైద్యశాలల్లో ఉచితంగా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఇప్పటి వరకు 3 వేల 958 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, మహిళా పోలీసు గౌసియా, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి...

బొల్లాపల్లి: మండల స్థాయిలో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీతో పాటు ఈకేవైసీ చేస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ కె జిలానీ బాషా శుక్రవారం తెలిపారు. కుటుంబం మొత్తం ఒక ఆరోగ్య శ్రీ కార్డు, ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఒక్కొక్క సభ్యుడికి ఒక కార్డు జారీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ కి సంబంధించి మండలంలో మేళ్లవాగు, గుమ్మనంపాడు, మూగచింతలపాలెం, పేరూరుపాడు గ్రామ సచివాలయాల్లో మాత్రమే కార్డులు జారీ కి సిద్ధంగా ఉన్నాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రూ.25 లక్షల రూపాయల విలువగల కార్పొరేట్ వైద్యానికి అవసరమైన ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తుందని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మండంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ తదితర పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రూ.25 లక్షల రూపాయల విలువైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో రొంపిచర్ల మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, బసిరెడ్డి వెంకట కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, ఎం.కోటిరెడ్డి, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం తెలిపారు. ఇక్కుర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 8 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న పేరుబోయిన నాగేశ్వరరావును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

సంకురాత్రిపాడు దేవాలయంలో చోరీ

నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామంలో కొలువైయున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీబీ నాంచారమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు-బైకు ఢీకొని ఇరువురికి గాయాలు



శావల్యాపురం: మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో కారు-బైకు రెండు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు తణుకు నుంచి మార్కాపురం వైపు కారు వెళ్తోంది. అయితే కనమర్లపూడి గ్రామానికి చెందిన నంబూరి చిన పేరయ్య, మాజీ సర్పంచ్ బోడెపూడి పేరయ్య ఇద్దరు బైకుపై వస్తుండగా బైకులో పెట్రోలు కొట్టించుకునేందుకు వస్తుండగా ప్రమాదవశ్తు కారు అదుపు తప్పి అతివేగంతో బైకును ఢీకొనగా నంబూరి పేరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. ఈఘటనలో నంబూరి పేరయ్యను మెరుగైన వైద్యసేవలు కోసం అత్యవసర వాహనం 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇది ఇలా ఉండగా ప్రమాదం జరిగిన ఏరియాల్లో ఎలాంటి ప్రమాద సూచక బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో మలుపు ఉండటంతో అధికంగా ఇదే ఏరియాలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతనంగా రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ పనులు గ్రామస్తులు దాతలు సహకారంతో శరవేగంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ముంద్రు రాఘవరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. తిరుమల-తిరుపతి దేవాలయ ట్రస్టు వారి రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేయగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనవంతు సహాయంగా రూ. 5 లక్షలు, దాతలు రూ.25 లక్షలు దేవాలయ పునః నిర్మాణ పనులకు అంద జేసినట్లు చెప్పారు. దేవాలయ నిర్మాణ పనులకు దాతలు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఏప్రిల్ నాటికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు స్వర్ణాల వెంకటరావు, పోత్తూరి వెంకట పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన దేవాలయ నిర్మాణ పనులు

చిరుధాన్యాల సాగుపై శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): చిరుధాన్యాల సాగుతో రైతులు మేలైన దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్. వరప్రసాదరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్‌లు అన్నారు. నూజెండ్లలోని ఆర్బీకేలో చిరుధాన్యాల సాగు-ప్రాముఖ్యతపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి పంటలకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొర్ర, రాగి, వరిగలు, అండుకొర్రలు, సామలు, జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల సాగును రెట్టింపు చేయాలనే ఉద్దేశంతో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చిరుధాన్యాల వల్ల కలుగు ఉపయోగాలు, అధునాతన వంగడాలు, పురుగులు, తెగుళ్ల యాజమాన్య గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో సుగుణా బేగం, ఏఈవో ఎల్.ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.మౌనిక, హిమబిందు, కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్

పంచాయతీ కార్యదర్శి శేఖర్ సేవలు ఎనలేనివి

నాదెండ్ల: మేజర్ గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అర్వపల్లి శేఖర్ సేవలు ఎనలేనివని డీఎల్‌పీవో పుట్టా రమణయ్య చెప్పారు. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శేఖర్ గత నెల 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలోని మండలనేని లక్ష్మయ్య కల్యాణ మండపంలో అర్వపల్లి శేఖర్ దంపతులను అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల క్రిందట పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగిగా చేరిన శేఖర్ ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారన్నారు. నాదెండ్ల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలైన సాతులూరు, నాదెండ్ల, గణపవరంలో ఎంతో చాకచక్యంగా పనిచేసి సమస్యలను పరిష్కరించారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, శేఖర్ తన క్రిందిస్థాయి సమస్యల పరిష్కారంలో విశేషంగా కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ తన తండ్రి డిప్యూటీ కలెక్టర్‌గా వివిధ జిల్లాల్లో పనిచేశారని, ఆయన స్ఫూర్తితో తాను ఉద్యోగం నిర్వర్తించానన్నారు. అనంతరం ఆయన్ను పలువురు పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, కౌన్సిలర్లు ఆదంవలి, గంగా శ్రీనివాసరావు, నాయకులు బొప్పూడి రామారావు, కక్కెర శ్రీనివాసరావు, చినబాబు, ఎంపీడీవోలు షేక్ జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసరావు, డీపీవోఏవో జయకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, నరసరావుపేట యార్డు మాజీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో రిటైరైన శేఖర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

వినుకొండలో గోవా మద్యం పట్టివేత

వినుకొండటౌన్: అక్రమ మద్యం విక్రయాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నరసరావుపేట సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ హెచ్చరించారు. పట్టణంలోని సెబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వినుకొండ రూరల్ చీకటీగలపాలెం వద్ద గల ప్రియాంక డాబా అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో అక్రమంగా విక్రయిస్తున్న దాదాపు రూ.1.15 లక్షల విలువ గల 15 బాక్స్‌ల గోవా మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు గోకనకొండకు చెందిన వల్లూరి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా ఇప్పటికే రూ.10.07 లక్షల విలువ చేసే మద్యాన్ని గోవాకు చెందిన నితిన్ బాలకృష్ణ టిక్వాడ్ ద్వారా కొనుగోలు చేసి విక్రయించినట్లు తేలిందన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా అక్రమంగా ఇసుక తరలింపు, గంజాయి విక్రయాలు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేసే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దాడుల్లో సెబ్ ఏఈఎస్ దుర్గాప్రసాద్, సీఐ అబ్దుల్ జలీల్, ఎస్ఐ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడితో సెబ్ అధికారులు

ఆర్బీకేల్లో కంది కొనుగోలు కేంద్రాలు

ముప్పాళ్ళ: రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని మాదల, ముప్పాళ్ళ గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కంది పంటలో యాజమాన్య పద్ధతులు, కందుల సేకరణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో కంది పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రస్తుతం క్వింటాకు రూ.7వేలు మద్దతు ధర ప్రకటించిందని, అయినప్పటికీ మార్కెట్ ధరకు అనుగుణంగానే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు. ముందుగా సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని వీఏఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

లేగదూడల పోషణలో మెలకువలు తప్పనిసరి

సత్తెనపల్లి: లేగ దూడల పోషణలో మెలకువలు తప్పనిసరిగా పాటించాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పి.రామారావు అన్నారు. కొమెరపూడి గ్రామంలోని పశు వైద్యశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి రైతులు లేగ దూడల పోషణలో మెలకువలను గ్రహించి పాటించాలన్నారు. సహాయ సంచాలకుడు డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పశువులకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. సత్తెనపల్లి ఏడీ డాక్టర్ మంగు శ్రీనివాసరావు పశువుల్లో పిండ మార్పిడి పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు సూచించారు. ప్రదర్శనకు 45 లేగ దూడలను తీసుకురాగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మిగిలిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 35 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ శ్యామ్‌సన్, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి ఐబూన్‌బీ ఇస్సా, గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, పశువైద్యాధి కారులు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.